క్లుప్తంగా

నూతన గృహప్రవేశం చేసిన ఎంపీ ఉత్తమ్ దంపతులు


నూతన గృహంలో పూజలు చేస్తున్న ఎంపీ ఉత్తమ్, పద్మావతి దంపతులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి దంపతులు ఇటీవల నిర్మించిన గృహంలో శుక్రవారం నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త ఇంట్లో హోమం, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యునిగా ఎన్నికైన ఉత్తమ్‌ను పలువురు నాయకులు ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

శాంతకుమారికి అడిషనల్ డీఆర్‌డీఓగా పదోన్నతి


ఎంపీడీఓ శాంతకుమారి

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీఓ టి.శాంతకుమారికి అడిషనల్ డీఆర్‌డీఓగా పదోన్నతి కల్పిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు.

12న గేదెల వేలం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో గల బందెల దొడ్డిలో గత 50 రోజులుగా ఉన్న 3 గేదెలను నెల 12వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు సర్పంచ్ పెరుగు పద్మ, కార్యదర్శి రఫీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గేదెల గురించి పరిసర గ్రామాల ప్రజలకు తెలియజేసినప్పటికీ వాటికోసం ఎవరూ రానందున వాటిని వేలం వేయాలని పాలకవర్గం తీర్మానించినట్లు వారు తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని వారు కోరారు.

లోక్ అదాలత్ సభ్యుడిగా మహేష్‌గౌడ్



గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన చెనగాని మహేష్‌గౌడ్‌ను లోక్ అదాలత్ సభ్యుడిగా నియమిస్తూ మండల న్యాయ సేవా సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంక్ రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి


రుణమేళా నిర్వహిస్తున్న సుధా కోఆపరేటీవ్ బ్యాంక్ ఎండీ గణేష్, అధికారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్, పరిసర గ్రామాల ప్రజలు సుధా కోఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ నిర్వహించే రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆ బ్యాంక్‌లో రుణమేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా ఇంటి మరమ్మతులు, విస్తరణ, చిరు వ్యాపారస్తులకు, దుకాణదారులకు తాకట్టు రుణాలు, వ్యాపార రుణాలు, టర్మ్‌లోన్‌లు, వాహన రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ సురేష్, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు, విలేకరులు సమష్టిగా కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం స్థానిక కోర్టులో జరిగే లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీ కావడానికి ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు పేర్కొన్నారు.

సాగర్ నీరు విడుదల చేయాలని వినతి

చిలుకూరు : సాగర్ నీటిని తక్షణమే విడుదల చేసి సాగర్ ఆయకట్టులో ఎండిపోతున్న వరి పొలాలను కాపాడాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం చిలుకూరు తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు జె. నరసింహారావు, మండల కార్యదర్శి నాగటి రాములు, నాయకులు ఎగ్గడి లింగయ్య, కందుకూరి శ్రీకాంత్, అమరబోయిన కృష్ణ పాల్గొన్నారు.

పేదల బతుకులు మారేనా..

- దేవుడి మాన్యం భూమిలో గుడిసెలు వేసుకుని బతుకుతున్న నిరుపేదలు
- 30 ఏళ్లుగా దుర్భర జీవితం
- 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకున్నా సొంత జాగ ఉండాలంటున్న అధికారులు
- ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వేడుకోలు


బేతవోలులో దేవుడి మాన్యం భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలు


ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పేదలు

చిలుకూరు : క్యాలెండర్‌లో తేదీలు మారుతూ ఏళ్లు గడుస్తున్నా నిరుపేదల జీవితాలు మాత్రం ఏమాత్రం మారడం లేదు. ఇందుకు నిదర్శనమే మండలంలోని బేతవోలు గ్రామంలో దేవుడి మాన్యం భూమిలో గత 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న నిరుపేదలు. బేతవోలులోని సర్వే నెంబర్ 1432 లో దేవుడి మాన్యం స్థలంలో గత 30 ఏళ్లుగా గ్రామానికి చెందిన 22 కుటుంబాల నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కూలీనాలీ చేసుకుంటూ బతుకుతున్నారు. ఒక్కో గుడిసెలో 2 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. ఏళ్లుగా వారు గుడిసెల్లో బతుకుతున్నా వారిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. గతంలో ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు ఇచ్చినా సొంత స్థలం లేకపోవడంతో వారికి ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. ఒకవేళ స్థలమున్నా ఇళ్లు నిర్మించుకునే స్థోమత కూడా వారికి లేదు. ఇళ్లు నిర్మించుకుందామని అనుకున్న దేవుడి మాన్యం భూములు కావడంతో వారికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చేలా లేదు.

'గృహలక్ష్మి'పై నిరాశే..

అయితే సొంత స్థలం ఉంటేనే ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పడంతో వారికి మళ్లీ నిరాశే మిగిలింది. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పలుమార్లు అధికారులకు తెలియజేసినా ఎలాంటి ప్రయోజనం లేదని అంటున్నారు. గత రెండు రోజులుగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, కోదాడ ఆర్డీఓ, తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. అధికారులు స్పందించి తక్షణమే తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహలక్ష్మి వర్తింపజేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



గత 30 ఏళ్లుగా దేవుడి మాన్యం భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నాం. ఇటీవల ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నాం. కానీ సొంత ఇంటి స్థలం ఉండాలని అధికారులు అంటున్నారు. దీంతో మాకు మళ్లీ నిరాశే మిగిలింది. ప్రభుత్వం స్పందించి మాకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– గణపారపు కనకమ్మ, బేతవోలు

అవినీతి, అక్రమాలకు తావు లేదు


మాట్లాడుతున్న ఎంపీడీఓ శాంతకుమారి

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేదని ఎంపీడీఓ టి.శాంతకుమారి అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఎంపీటీసీలతో కలిసి మాట్లాడారు. ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అవినీతి అక్రమాలంటూ మహిళా ఉద్యోగులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 23-03-2023న మండల పరిషత్ సమావేశంలో చేసిన తీర్మానాల ప్రకారం ఐదుగురు ఎంపీటీసీలు సంతకాలు చేశారని, ఆ ప్రొసీడింగ్‌పై ఎంపీపీ సంతకం చేయకుండా ఎంపీటీసీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. 2023- 24 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులు 65 శాతం ఖర్చు చేయకపోతే నిధులు రిటన్ వెళ్తాయని చెప్పినా ఆయన వినిపించుకోకుండా తన అధిపత్య పోరు కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ పట్ల ఎంపీపీ అసభ్యకరంగా మాట్లాడినా ఎవరికి చెప్పుకోలేదని చంద్రకళ విలపించారు. మండలంలోని ఏడుగురు ఎంపీటీసీలకు గాను ఐదుగురు ఇటీవల ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టారనే విషయం మనస్సులో పెట్టుకుని ఎంపీటీసీలకు ఇచ్చిన నిధులకు బిల్లులు కాకుండా చెక్కులపై సంతకాలు చేయడం లేదని వేపలసింగారం ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి ఆరోపించారు. ఎంపీడీఓ, సీనియర్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడ్డారనేది పచ్చి అబద్ధమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సింగతల సైదమ్మ, ఎంపీటీసీలు వల్లభనేని విజయలక్ష్మి, రాజారావు, కాశమ్మ, సూపరింటెండెంట్ నర్సిరెడ్డి, పలువురు కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు ఎన్నికల నిబంధనలు పాటించాలి


శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

చిలుకూరు : బీఎల్‌ఓలు ఎన్నికల నియమ నిబంధలను అనుగుణంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ సరిత అన్నారు. శుక్రవారం చిలుకూరులో బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాను జాగ్రత్తగా తప్పులు లేకుండా చూడాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ మంజుల, ఏఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నడిగూడెం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని పలువురు ఉద్యోగులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని, ప్రభుత్వం స్పందించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ, వెంకటేశ్వరరావు, ఈశ్వర్, వీరన్న, కొల్లు శ్రీనివాస్, రజిత, మధార్, ఉపేందర్, రాములు, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్

హుజూర్‌నగర్ : పట్టణంలో నిర్వహించే ముత్యాలమ్మ జాతరలో పారిశుద్ధ్య లోపం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు అన్నారు. జాతర సందర్భంగా శుక్రవారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, లైటింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు స్ప్రేయింగ్, బ్లీచింగ్ చల్లాలని అన్నారు. కౌన్సిలర్ ములకలపల్లి రాంగోపి, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కేసీఆర్ కృషి

మునగాల : జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని టీయూడబ్ల్యూ జేహెచ్- 143 జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారింగుల అంజన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బరాఖత్‌గూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐజేయూకు చెందిన పలువురు జర్నలిస్టులు అంజన్‌గౌడ్ సమక్షంలో టీయూడబ్ల్యూ జేహెచ్-143లో చేరారు. అనంతరం అంజన్‌గౌడ్‌తో పాటు జిల్లా నాయకులను, అతిథులు సామాజిక ఉద్యమకారులు డా.వేమూరి సత్యనారాయణ, డా.నరాల రుక్మారావులను మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేహెచ్- 143 జిల్లా ప్రధాన కార్యదర్శి హరికిషన్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వంగవేటి శ్రీనివాస్, కోదాడ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పిడమర్తి గాంధి, నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పడిశాల రఘు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మరికంటి లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తంగెళ్లపల్లి లక్ష్మణ్, సీనియర్ జర్నలిస్టులు జీఎస్‌రెడ్డి, జెజె.సామ్యూల్, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బెజవాడ గోవర్ధన్, జర్నలిస్టులు దస్తగిరి, గోపి, శ్రీను, సతీష్, రవి, గడ్డం లక్ష్మీనారాయణ, పాషా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లకు వేతనాలు అందజేత


చెక్కు అందజేస్తున్న మైహోం అధికారులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వలంటీర్లకు 2023- 24 సంవత్సరానికి గాను వేతనాల నిమిత్తం రూ.లక్ష చెక్కును మై హోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సంస్థ జనరల్ మేనేజర్ డాక్టర్ నాగేశ్వరరావు, అడ్వైజర్ జగన్నాథరావులు బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణవేణినరేష్, పాఠశాల హెచ్‌ఎం లూర్దుమారెడ్డికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రత్నం, ఏజీఎం శ్రీనివాస్, శ్రీహరి, విద్యా వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

కోదాడ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని పార్లమెంటు సమావేశాలలో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు తెలిపేవిధంగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మార్పీస్ నాయకులు శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఒత్తిడి తీసుకురావడానికి బీఆర్‌ఎస్ నాయకులు అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకొనిపోయే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపూరి రాజు, కత్తి వెంకటేశ్వర్లు, యలమర్తి రాము, వడ్డేపల్లి కోటేష్, ఏపూరి పర్వతాలు, సత్యరాజు, సైదులు, కళ్యాణ్, బ్రహ్మం, దాసు, అఖిల్, పాండు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'సీజనల్' ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు

నడిగూడెం : ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా శుక్రవారం నడిగూడెంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, పలు చోట్ల దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

హుజూర్‌నగర్ : ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో సీడీపీఓ విజయలక్ష్మికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ వరకు అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల 11వ తేదీ నుంచి వారితో కలిసి సమ్మె చేస్తామని అన్నారు.

ఆయుష్మాన్ భారత్ నమోదు కేంద్రం ప్రారంభం

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో ఆయుష్మాన్ భారత్ కేవైసీ నమోదు కేంద్రాన్ని శుక్రవారం కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు మేకల నాగరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు, ఆధార్ కార్డులతో అర్హులైన ప్రతిఒక్కరూ నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. 16 రకాల జబ్బులకు ఈ పథకం ద్వారా వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు.

మాయమాటలతో మభ్యపెడుతున్న కేసీఆర్

గరిడేపల్లి : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతున్నాడని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ విమర్శించారు. శుక్రవారం గరిడేపల్లిలోని సీపీఎం కార్యాలయంలో యానాల సోమయ్య అధ్యక్షతన జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన కొనసాగించాలని కోరారు. సమావేశంలో నాయకులు అంబటి భిక్షం, మహబూబ్‌అలీ, దోసపాటి భిక్షం, సోమయ్య, హుస్సేన్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, శ్రీనివాస్, సుధాకర్, అరవింద్, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీవి ప్రజా వ్యతిరేక విధానాలు

హుజూర్‌నగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.పాండు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామిక వ్యవస్థ స్థానంలో నియంతృత్వ పాశవిక వ్యవస్థను తీసుకురావాలని చూస్తుందని, ఈ కుట్రలో భాగమే జమిలి ఎన్నికలని ఆయన అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరయ్య, హుస్సేన్, వెంకటరెడ్డి, భిక్షం, ఖాసీం, వీరస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం


అబ్దుల్ లతీఫ్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

హుజూర్‌నగర్ : ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన హుజూర్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్‌ను శుక్రవారం వైఎస్సార్‌టీపీ జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాసరావు శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు వి.మాధవి, వి.జయప్రద, అభిలాష, కల్పన, సరోజ్, వైఎస్సార్‌టీపీ నాయకులు ఉపేందర్, అబ్దుల్ రహీం, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


పీఏసీఎస్ గోదాము నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నూతనంగా చేపట్టిన వ్యవసాయ గోదాము నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో సహకార సంఘాలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలను బలోపేతం చేసి అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సొసైటీ పాలకవర్గం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, వైస్ చైర్మన్ చెన్నారెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్, సర్పంచ్ చింతకాయల ఉపేందర్, కోఆపరేటివ్ జిల్లా డైరెక్టర్ కొండ సైదయ్య, తాడువాయి సొసైటీ చైర్మన్ సీతారాములు, బీఆర్‌ఎస్ మండల నాయకులు ఎలక నరేందర్‌రెడ్డి, గన్నా నరసింహారావు, లింగారెడ్డి, వీరమ్మ, ఉపేందర్, సత్యనారాయణరెడ్డి, అధికారులు, డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


నేరేడుచర్ల : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో నలభై సంవత్సరాలుగా జరగని అభివృద్ధి మూడున్నర ఏళ్లల్లోనే జరిగిందన్నారు. రూ. 3500 కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అధికారులు ప్రజా సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో ఉండి పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంపీపీ లక్కుమళ్ల జ్యోతి ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంపీపీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ విజయకుమారి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సైదన్న ఆశీర్వాదంతో అభివృద్ధి

పాలకవీడు : జాన్‌పహాడ్ సైదన్న ఆశీర్వాదంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గాను ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సైదులు బాబా సమాదులపై చాదర్ దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కందూరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పాలకవీడు, నేరేడుచర్ల మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, సురేష్, పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనరాయణరెడ్డి, వెంకటి, పూజారి జానీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించడమే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడ : రానున్న ఎన్నికల్లో కోదాడలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి కోరారు. శుక్రవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన 17 - 27 వార్డుల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కోదాడ పట్టణం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, దానిని మరింత బలోపేతం చేసుకోవాలని కోరారు. వార్డులలో బూతుల వారీగా ఓటర్ల వివరాలను సేకరించడంతో పాటు అందరి ఓట్లు జాబితాలో ఉన్నాయో, లేవో చూసుకోవాలని కోరారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక సమన్వయ కర్తను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో వంగవేటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణ, పారా సీతయ్య, బషీర్, పాలూరి సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ రాజ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ : తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజా స్వామ్యవాదులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి కోరారు. శుక్రవారం 'ఊరు మనదిరా.. కాంగ్రెస్ మనదిరా' కార్యక్రమంలో భాగంగా కోదాడలో ఆయన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నష్టం జరుగుతుందని తెలిసినా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందని అన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో దొరలపాలనకు తెరదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ కోదాడ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు


దరఖాస్తు అందజేస్తున్న రామకృష్ణ యాదవ్

మునగాల : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు అందజేసినట్లు పేర్కొన్నారు. తాను గత 18 సంత్సరాలుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బీసీ ఉద్యమంలో భాగంగా హాస్టల్ విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, విద్యార్థుల ఉపకార వేతనాల కోసం ఉద్యమాలు చేపట్టినట్లు వివరించారు. గతంలో ఏబీవీపీలో పనిచేసిన అనుభవం ఉందని ఆయన తెలిపారు.

అక్షరాస్యతతోనే సమసమాజ నిర్మాణం


కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : అక్షరాస్యతతోనే సమసమాజ నిర్మాణం సాధ్యమని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు శ్రీదేవి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి, శంకర్, షబీన తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్, లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ యడవల్లి సత్యనారాయణరెడ్డి, సభ్యులు శ్రీనివాసరావు, రంగారెడ్డి, విశ్వనాథం, నర్సకుమారి, పద్మావతి, శౌరి, వెంకటేశ్వరరావు, నర్సింహారావు, కృష్ణప్రసాద్, రవి, కల్పన, భవాని, నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పత్రాలు పంపిణీ


రైతులకు రుణమాఫీ పత్రాలను అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

కోదాడ : కోదాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 1759 మంది రైతులకు 4 కోట్ల 60 లక్షల రూపాయల రుణమాఫీ అయిందని ఆ సంఘం చైర్మన్ ఆవుల రామారావు తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో తొగర్రాయి, కూచిపూడి తండా, గుడిబండ, కొమరబండ గ్రామాలకు చెందిన రైతులకు రుణమాఫీ పత్రాలను ఆయన అందజేసి మాట్లాడారు. సంఘం పరిధిలో 2947 మంది రైతులు రూ. 8.60 కోట్ల రుణాలు తీసుకోగా అందులో ఇప్పటివరకు రూ.4.60 కోట్లు మాఫీ జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సీఈఓ మంద వెంకటేశ్వర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.